క్లుప్తంగా

నేడు గిరి ప్రదక్షిణ


తిరుమలనాథ స్వామి మూల విరాట్

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంపల్లె వద్ద వెలసిన తిరుమలనాథ స్వామి ఆలయంలో శనివారం గిరిప్రదక్షిణ నిర్వహించనున్నారు. శ్రావణ మాసం శ్రావణా నక్షత్ర పౌర్ణమి సందర్భంగా ఈ గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త మూలె హజరత్ రెడ్డి తెలిపారు. ఆలయం చుట్టూ ఒక కిలోమీటరు మేర భక్తులు ఈ ప్రదక్షిణను చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని తోట్లపల్లె అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వామి, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభిస్తారని వివరించారు. ప్రతి నెల పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ప్రొద్దుటూరు : స్థానిక శంకర్ రావు వీధి మున్సిపల్ స్కూల్‌లో ఈనెల 10 ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇర్ఫాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు రాజశేఖర్ వర్మ, వీరప్రసాద్‌రెడ్డి, హరీష్‌బాబు, బీఎస్ఎల్ రెడ్డి, నాగశేఖర్‌రెడ్డి గుండె, కీళ్లు, ఎముకలు, ఇతర సంబంధిత వ్యాధులతోపాటు బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తామని ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంపల్లెలో ఆత్మహత్య చేసుకున్న ఇంద్రసేనారెడ్డి అనే రైతు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. శుక్రవారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.శ్రీరాములు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ విలేకరులతో మాట్లాడుతూ కౌలు వ్యవసాయం చేస్తున్న రైతు ఇంద్రసేనారెడ్డి పంటల సాగుతో అప్పులు పెరిగి ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమని తెలిపారు. ఆయన ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారని, వారి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. బ్రహ్మంగారిమఠం మండలం లింగాలదిన్నె పల్లెకు చెందిన భూమిరెడ్డి సుబ్బిరెడ్డి అనే రైతు మూడు రోజుల క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి శుక్రవారం మరణించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. సుబ్బిరెడ్డి ఆత్మహత్యకు కారణమైన వారిని ప్రభుత్వం శిక్షించాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సమితి సభ్యుడు కె.రామాంజనేయులు, సీపీఐ మైదుకూరు పట్టణ కార్యదర్శి డి.సుబ్బరాయుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు బి.పీరయ్య, పి.శంకర్ పాల్గొన్నారు.

అన్నదానం


భోజనం వడ్డిస్తున్న రామాంజులరెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక ఆర్టీపీపీ రోడ్డులోని విశ్వ ప్రేమ వృద్ధాశ్రమంలో శుక్రవారం వైఎంఆర్‌కాలనీకి చెందిన టీటీడీ శ్వేత అకాడమీ మాజీ డైరెక్టర్ డాక్టర్ కటికరెడ్డి రామాంజులరెడ్డి తన తండ్రి కటికరెడ్డి రామచంద్రారెడ్డి ఐదో వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తన తండ్రి రైతు అని, ఆయన జ్ఞాపకార్థం ప్రకృతి వ్యవసాయంలో మంచి దిగుబడి సాధించిన రైతుకు రూ.5వేలు నగదు ప్రోత్సాహక బహుమతి ఇవ్వనున్నట్లు రామాంజులరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో లిఖిత్ సుందర్‌రెడ్డి, శ్రియ రెడ్డి, లక్ష్మీదేవమ్మ, కుటుంబ సభ్యులు, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్సార్ సర్కిల్: కూటమి ప్రభుత్వం అధికారం రాగానే పేదలందరికి పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారని, కానీ అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్నా ఇంతవరకు అతీగతీ లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర ప్రశ్నించారు. శుక్రవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రాంతాలలో సొంత ఇండ్లు లేక బాడుగ ఇండ్లలో ఉండలేక ఒకే ఇంట్లో రెండు మూడు కుటుంబాలు ఉంటూ దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పేదల సొంతింటి కల సాకారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె సి బాదుల్లా, నగర కార్యవర్గ సభ్యులు కె మునెయ్య పాల్గొన్నారు.

భక్తితో పూజించండి.. ప్రకృతిని పాడుచేయకండి

- మట్టి గణపతులకు ఆదరణ కరువు
- పీఓపీతో వినాయకుడి విగ్రహాల తయారీ
- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో ఆరోగ్యానికి హాని


పీఓపీతో తయారు చేసిన గణేష్ విగ్రహాలు

బద్వేలు: ప్రపంచ వ్యాప్తంగా పిల్లలు, పెద్దలు అత్యంత ఇష్టంగా జరుపుకునే పండుగ వినాయకచవితి. చవితి వేడుకల హడావుడిలో ఆకర్షణీయంగా కనిపించే రసాయన విగ్రహాల (పీఓపీ) వల్ల జరిగే పర్యావరణ హాని గురించి మరచిపోతున్నారు. ఒకప్పుడు గ్రామానికి ఒకటో రెండో మట్టి విగ్రహాలు పెట్టి పూజలు చేసి పండుగ జరుపుకునే వారు. ఇప్పుడు ప్రతి పల్లెలో పీఓపీతో చేసిన వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసి కాలుష్యానికి కారకులవుతున్నారు. ఈ నెల 27న వినాయకచవితి పండుగ సందర్భంగా పోరుమామిళ్ల, బద్వేలు కేంద్రాలుగా పీఓపీతో వినాయకుడి విగ్రహాలు తయారు చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు హానికరమని పర్యావరణ వేత్తలు చెబుతున్న నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. వివిధ రంగులతో ఆకర్షణీయంగా కనిపించే పీఓపీ ప్రతిమలకే ముగ్గు చూపుతున్నారు.

పీఓపీతో పెను ప్రమాదం

వినాయకులను తయారు చేసే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ నీటిలో కరగదు. మట్టిలో కలవదు. నిప్పునకూ దహనం కాదు. దీని ముడిపదార్థం జిప్సం. పీఓపీతో తయారు చేసిన వినాయక విగ్రహాలను చెరువుల్లో, ఇతర నీటి వనరుల్లో వేస్తాం. ఆ నీటిని మనుషులు, ఇతర జీవరాసులు వాడితే హాని కలిగించే ఆస్కారం ఉంది. విగ్రమాల తయారీలో వాడే హానికారక రసాయనాలతో డయేరియా, చర్మ వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. చర్మం రంగు మారడం, స్కిన్ క్యాన్సర్‌కు ఆస్కారం ఉంది. ఆర్సానిక్స్ వల్ల తల వెంట్రుకలు ఊడతాయి. సీసం ప్రభావంతో కడుపు నొప్పి వస్తుంది. శరీర పటుత్వం తగ్గుతుంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రంగులతో తయారు చేసిన వినాయక ప్రతిమలను నిమజ్జనం చేసిన నీటిని వినియోగిస్తే వివిధ రకాల వ్యాధులొస్తాయి. జల చరాలు, పశువులకూ ఆ నీటితో ముప్పే, అందుకే రసాయనాలతో చేసిన విగ్రహాలను తగ్గించాలంటూ ఏటా పర్యావరణ వేత్తలు, శాస్త్రవేత్తలు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. వినాయక విగ్రహాలు వేసిన రసాయన నీటిని పొలాలకు మళ్లిస్తే భూసారం తగ్గి భూమి సహజ స్వరూపాన్ని కోల్పోతుంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, ప్రతిమలతో అన్నీ ఇబ్బందులే. విగ్రహాల తయారీకి వాడే రసాయనాలు నీటిలో కరిగేందుకు 45రోజుల నుంచి ఏడాది వరకు సమయం పడుతుంది. వినాయక ప్రతిమల తయారీకి ఉపయోగించే క్లాడ్మియం చాలా ప్రమాదకర రసాయన పదార్థం. ప్రతిమల్లో అదనపు ఆకర్షణకు దీన్ని వాడతారు. పీఓపీ చిట్లినట్లు.. పగుళ్లు రాకుండా చూసేందుకు ప్రతిమ దృఢత్వానికి దీనిని వినియోగిస్తున్నారు. మనిషి మెదడుపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది. బ్రెయిన్ క్యాన్సర్‌కు కారణమవుతుంది. తయారీ చోట గర్భిణులుంటే పుట్టబోయే శిశువులపైనా విషప్రభావం చూపుతుంది. వినాయక విగ్రహాల తయారీలో ఇలాంటి ప్రమాదకర రసాయనాలెన్నో వినియోగిస్తున్నారు.

యథేచ్ఛగా విగ్రహాల తయారీ

జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో 2016లోనే పలు రాష్ట్రాలు పీఓపీ విగ్రహాల తయారీపై నిషేధం విధించారు. అయినా యథేచ్ఛగా పీఓపీ విగ్రహాలను తయారు చేస్తున్నారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ యంత్రాగం నిర్లక్ష్యం వలన ప్రతిఏటా వేలల్లో విగ్రహాలు తయారవుతూనే ఉన్నాయి.కాలుష్య నియంత్రణ మండలి ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో విఫలమైంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో చేసిన వినాయకుడి ప్రతిమల వలన కలిగే దుష్పరిమాణాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. జిల్లాలో చాలా నియోజక వర్గాల్లో ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై నిషేధం అమలు చేస్తున్నారు.అ దే స్ఫూర్తితో పీఓపీపై నిషేధం ఉండాల్సిన అవసరం ఉంది. ఈ ఏడాది మట్టి విగ్రహాలను పూజించే విధంగా జిల్లా యంత్రాంగంతో పాటు స్థానిక అధికారులు కూడా పీఓపీ విగ్రహాలను నిషేధించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కోరుతున్నారు.

ప్రైవేట్ హాస్పిటల్స్‌లో తనిఖీలు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని పలు ప్రైవేట్ హాస్పిటల్స్‌లో వైద్యాధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం హాస్పిటల్స్ నడుస్తున్నాయా లేదా అని పరిశీలించారు. ఫైర్, బయోమెడికల్ వేస్టేజ్, పొల్యూషన్‌లకు కాలపరిమితి, హాస్పిటల్స్‌కు వచ్చిన రోగుల వసతి, వార్డులు, వాష్ రూమ్‌లు, మంచి నీటి వసతి, రికార్డుల నిర్వహణ తదితర వాటిని పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, ప్రతి ప్రైవేట్ హాస్పిటల్ తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని డాక్టర్ గీత హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రొద్దుటూరు : కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,121 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పంచాయతీలకు విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల పంచాయతీల్లో అభివృద్ధి పడకేసిందన్నారు. ఎన్నో ఆశలతో గ్రామాల్లో అభివృద్ధి చేద్దామనే ఉత్సాహంతో ఎన్నికైన సర్పంచ్‌లకు నిధులు లేక, ప్రభుత్వ ప్రోత్సాహం లేక అభివృద్ధి కార్యక్రమాలను నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. సర్పంచ్‌లు అప్పులు తెచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే వాటికి బిల్లులు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. 15వ ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులను విద్యుత్ బకాయిల పేరుతో దారిమళ్లించాలనుకోవడం దురదృష్టకరమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మొదటి విడత నిధులు విడుదల చేసినా.. గత ఆరు నెలలుగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,121 కోట్లు విడుదల చేయకపోవడంతో సమస్యలతో గ్రామ పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్‌ల గౌరవ వేతనం రూ.3వేల నుంచి రూ.10వేలకు పెంచాలన్నారు. సర్పంచ్‌లు విధి నిర్వహణలో మరణిస్తే రూ.20లక్షల వరకు ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించాలని, 5వ షెడ్యూల్ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లోని గ్రామాల అభివృద్ధికి, గిరిజన తాండాల గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 5వ ఆర్థిక సంఘం ఏర్పాటు చేసి రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు నాలుగేళ్లుగా రావాల్సిన నిధులను బదిలీ చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వి.అన్వేష్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో లైంగిక దాడి నిందితుడు


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

కలసపాడు : నాలుగేళ్ల చిన్నారిపై లైంగికదాడి చేసిన నిందితుడు నరేంద్రను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మండలంలోని గంగాయపల్లెలో గురువారం జరిగిన ఈ సంఘటనపై మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ శుక్రవారం ఘటన స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలో పలువురిని బాలికపై జరిగిన లైంగిక దాడిపై విచారించారు. ఫోరెన్సిక్ సైంటిఫిక్ ఆఫీసర్ కిశోర్‌కుమార్ రెడ్డి ఆధారాలను సేకరించారు. పోరుమామిళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను మెరుగైన చికిత్స కోసం శుక్రవారం కడపకు తరలించినట్లు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. నిందితుడికి కఠినంగా శిక్ష పడేలా అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి ఆధారాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. డీఎస్పీ వెంట బద్వేలు సీఐ నాగభూషణం, కలసపాడు ఎస్ఐ తిమోతి, పోరుమామిళ్ల ఎస్ఐ కొండారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మితిమీరిన వేగంతో ప్రమాదం

కడప ఎడ్యుకేషన్: మితిమీరిన వేగం ప్రమాదమే కాదని ప్రాణనష్టం కూడా కలిగిస్తుందని కడప ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జావీద్ అన్నారు. శుక్రవారం కడప నగరంలోని శ్రీ వివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో రహదారి భద్రత.. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ డి.కె.జావీద్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించటం కేవలం చట్టానికి లోబడే కాదని అది మన భద్రత కోసం, మన కుటుంబాల భద్రత కోసం అన్నారు. మితి మీరిన వేగం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్స్ ఇవన్నీ ప్రమాదాలకే కాదు, ప్రాణ నష్టం వరకు తీసుకెళ్లే మార్గాలు అని హెచ్చరించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చేతివృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.బాలు

బద్వేలు అర్బన్ : నియోజకవర్గంలోని వివిధ చేతివృత్తిదారుల సమస్యలు పరిష్కరించడంతో పాటు వారికి ప్రత్యేకంగా రుణాలు మంజూరు చేసి ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.బాలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన చేతివృత్తిదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా ఆయా వృత్తులలో యంత్రాల వాడకం అధికమైన నేపథ్యంలో చేతివృత్తిదారులు పనులు లేక దుర్భర జీవితం గడుపుతున్నారని అన్నారు. అర్హులైన చేతివృత్తిదారులను గుర్తించి వారికి రుణాలు మంజూరు చేయడంతో పాటు చేతివృత్తులను ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో చేతివృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు పి.నాగరాజు, సీపీఐ రూరల్ కార్యదర్శి ఇమ్మానియేల్, చేతివృత్తిదారుల సంఘం కన్వీనర్ వెంకటరామయ్య, కో కన్వీనర్లు శివప్రసాద్‌రెడ్డి, బాలసుబ్బయ్య, కమిటీ సభ్యులు రవి, సుబ్బరాయుడు, వెంకట్, క్రాంతి, శశికుమార్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు


ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ

ఖాజీపేట : ఖాజీపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష పదవి ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. అయితే ఈ సారి ఎన్నిక ఏకగ్రీవం కోసం ప్రయత్నాలు చేశారు. విఫలం కావడంతో పోటీ అనివార్యమైంది. తాతా వెంకట సుబ్రహ్మణ్యం, మడియాల మురళీకృష్ణ అధ్యక్ష పదవికి పోటీ పడ్డారు. ఇద్దరూ నువ్వా నేనా అన్నట్లు తలపడ్డారు. ఒకరు వెండి గిన్నెతోపాటు రూ. 2వేల నగదు ఇస్తే.. మరొకరు ఓటుకు రూ. 2వేలు పంచిపెట్టారు. గురువారం రాత్రి 7గంటలకు అమ్మవారిశాలలో అధ్యక్ష పదవికి ఎన్నిక జరిగింది. మొత్తం 169 ఓట్లు పోల్ కాగా అందులో మడియాల మురళీకృష్ణకు 92 ఓట్లు వచ్చాయి. తాతా వెంకట సుబ్రహ్మణ్యంకు 77 ఓట్లు వచ్చాయి. 15 ఓట్ల మెజార్టీతో మురళీ విజయం సాధించారు. ఆర్య వైశ్య సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని,తన విజయానికి సహకరించిన అందరికీ నూతన అధ్యక్షుడు మురళీకృష్ణ అభినందనలు తెలిపారు.

దళితుల హక్కుల కోసం పోరాటం


ఏపీ దళిత సమాఖ్య ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు

ప్రొద్దుటూరు : దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తామని ఏపీ దళిత సమాఖ్య ప్రొద్దుటూరు ఇన్‌చార్జి ఈశ్వర్ ప్రకటించారు. శుక్రవారం ఏపీ దళిత సమాఖ్య 23వ ఆవిర్భావం దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ దళిత, బహుజన వర్గాల సమస్యల పరిష్కారం కోసం ఏపీ దళిత సమాఖ్య పోరాటాలు చేస్తోందన్నారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు విద్యార్థి విభాగాన్ని బలోపేతం చేస్తామన్నారు. ఈ దళిత సమాఖ్య మహిళా విభాగం కన్వీనర్ సక్కుబాయి, సమాఖ్య నాయకులు ఇస్లావత్ నాయక్, చక్రి, రవి, జయరాం పాల్గొన్నారు.

అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్


ప్రొద్దుటూరు కల్చరల్: ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి


బద్వేలు అర్బన్ : యద్దారెడ్డికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి గీత బెహన్‌జీ

ప్రొద్దుటూరు కల్చరల్ : అనుబంధానికి, ఆత్మరక్షణకు ప్రతీక రక్షాబంధన్ అని ఓంశాంతి భవనం నిర్వాహకురాలు శాంత తెలిపారు. శుక్రవారం మండలంలోని రాధానగర్‌లో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి దంపతులకు, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డికి, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ భావన, కౌన్సిలర్ పిట్టా బాలాజీ, డాక్టర్లు వై.చెన్నకేశవరెడ్డి దంపతులకు, పలువురు ప్రముఖులకు బీకే శాంత, సౌజన్య శ్రావణ శుక్ర పౌర్ణమి సందర్భంగా తిలకం దిద్ది రాఖీలు కట్టారు. ఆయురారోగ్య, ఐశ్వర్యాలకు ప్రతీకగా ఆరావళి పర్వతాల నుండి తెచ్చిన యజ్ఞోపవీతమైన పవిత్ర రాఖీని కట్టి, మధురతకు గుర్తుగా మిఠాయిని తినిపించారు. రాఖీ పండుగ మానవ సంబంధాలను పటిష్టం చేస్తూ, కుటుంబబంధాలను బాంధవ్యాలుగా బలపరుస్తుందని బీకే శాంత తెలిపారు. కులమతాలకు అతీతంగా భారతీయ సనాతన ఆచారాల్లో నిర్వహించుకునే పండగల్లో విశేషమైనది రక్షాబంధనం అని చెప్పారు.

అనుబంధాలకు ప్రతీక రక్షాబంధన్

బద్వేలు అర్బన్ : మానవీయ సంబంధాలను పటిష్టం చేస్తూ ప్రేమానురాగాలను పెంచడమే రక్షాబంధన్ ఉద్దేశ్యమని బ్రహ్మకుమారి ఈశ్వరీయ సంస్థ అడిషనల్ జోన్ ఇన్‌చార్జి గీతబెహన్‌జీ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కార్యాలయంలో రక్షాబంధన్ ఆవశ్యకతపై నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్ల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈగ యద్దారెడ్డికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్వార్థసేవతో దైవమార్గాన్ని ప్రబోధిస్తున్న బ్రహ్మకుమారీలు ప్రతిఒక్కరికి ఆదర్శనీయులని తెలిపారు. బద్వేలు బ్రాంచ్ బ్రహ్మకుమారీలు సుధారాణి బెహన్‌జీ, కౌన్సిలర్ పద్మావతి, జనార్దన్‌రెడ్డి, విజయ, చంద్రక్క తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలి


మాట్లాడుతున్న విభిన్న ప్రతిభావంతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు

బద్వేలు అర్బన్ : దివ్యాంగులకు కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని విభిన్న ప్రతిభావంతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్లట ఒబులేసు పేర్కొన్నారు. శుక్రవారం వారి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్నారని తెలిపారు. జనాభాలో 4 శాతం మాత్రమే ఉన్న దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా ప్రభుత్వానికి పెద్దగా ఆర్థికపరమైన నష్టం కలిగే అవకాశం లేదని, ప్రభుత్వ పెద్దలు ఆలోచించి దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. విభిన్న ప్రతిభావంతుల సంఘం పట్టణ అధ్యక్షుడు రఫీ, ఏరియా అధ్యక్షుడు బాలరాజు, నాయకులు సుబ్బరాయుడు, నారాయణ, మహిళా విభాగం అధ్యక్షురాలు నాగమణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మైదుకూరు : మైదుకూరు, నంద్యాలంపేట సబ్‌స్టేషన్ల పరిధిలో రెండు ఫీడర్లలో శనివారం మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రామభద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు సబ్‌స్టేషన్ పరిధిలో శ్రీనగరం ఫీడర్, నంద్యాలంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గాంధీ నగర్ ఫీడర్లలో ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన వివరించారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.


బద్వేలు సబ్ డివిజన్ పరిధిలో..


బద్వేలు అర్బన్ : బద్వేలు సబ్ డివిజన్ పరిధిలోని శ్రీనివాసపురం, గానుగపెంట, పి.పి.కుంట సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాలకు శనివారం ఉదయం 9–00 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈఈ శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు, రైతులు గమనించి అంతరాయానికి సహకరించాలని కోరారు.


గోపవరం మండలంలో..

గోపవరం : విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈఈ శివకుమార్ తెలిపారు. మండలంలోని శ్రీనివాసపురం, పి.పి.కుంట, పోరుమామిళ్ల మండలంలోని గానుగపెంట సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

అన్ని వ్రతాలూ.. అమ్మ ఆశీస్సుల కోసమే


ప్రొద్దుటూరు కల్చరల్ : వ్రతాన్ని ఆచరిస్తున్న మహిళలు


పోరుమామిళ్ల: వేంకటేశ్వరస్వామి ఆలయంలో వత్రం చేస్తున్న మహిళలు


రాజుపాలెం: వెల్లాల సంజీవరాయ కల్యాణ మండపంలో వరలక్ష్మి వ్రతం చేస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు ఆలయాల్లో, ఇళ్లల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. తమను సుమంగళిగా చూడాలని అమ్మవారిని మహిళలు శరణువేడుకున్నారు. స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సామూహికంగా మహిళలు వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే వాసవి కన్యకా పరమేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయంలో చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. అమ్మవారికి కుంకుమార్చన చేశారు. రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో లలితాదేవికి విశేష పూజలు చేసి అలంకరించారు.

వైభవంగా వరలక్ష్మీదేవి వ్రతం

పోరుమామిళ్ల: పట్టణంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం వరలక్ష్మీదేవి వ్రతం వైభవంగా జరిగింది. సంప్రదాయ పద్ధతిలో వరలక్ష్మీదేవిని ప్రతిష్టి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమం ముగిసిన అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మహిళలకు జాకెట్, గాజులు, ప్రసాదాలు పంపిణీ చేశారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో..

పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో వరలక్ష్మి వ్రతం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వ్రత నిర్వహణకు రొద్దం శ్రావణి, కల్యా చరణ్‌తేజ, పెసల వాణి పూజా సామగ్రి, పట్టువస్త్రాలు అందచేశారు. అనంతరం భక్తులకు దేవస్థాన కమిటీ అన్నదానం ఏర్పాటు చేసింది.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం

కాశినాయన : మండల ప్రజలు శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. వరికుంట్ల సమీపంలోని నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. మహిళలు వ్రతంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వరలక్ష్మీ వ్రతం ఆచరించడం వల్ల కలిగే శుభాలను అర్చకులు భక్తులకు వివరించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

బ్రహ్మంగారిమఠం: వరలక్ష్మి వ్రతాన్ని శుక్రవారం మండలంలో పలు గ్రామాల్లో మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి మహిళలు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. బి.మఠం, ఈశ్వరీదేవిమఠం, పలు ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజుపాలెం : మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల పుణ్యక్షేత్రంలోని సంజీవరాయ కల్యాణ మండపంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం అంగరంగ వైభవంగా జరిగింది. వరలక్ష్మీదేవి అమ్మవారిని కలశాలోకి ఆవాహన చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేశారు. అర్చకులు మాట్లాడుతూ ఈవ్రతం చేయడం వల్ల సకల సౌభాగ్యాలు కలుగుతాయని వివరించారు. ఆలయ ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మినారాయణ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రత్యేక అలంకరణలో వరలక్ష్మీదేవి


బ్రహ్మంగారిమఠం: పూజలందుకుంటున్న అమ్మవారు


కాశినాయన : వరలక్ష్మి వ్రతం చేస్తున్న మహిళలు